క్లుప్తంగా

ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలి

మహారాణిపేట: రామాటాకీస్ రోడ్డులోని ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో రోగుల కోసం రక్త పరీక్షలు, సీటీ స్కానింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈమేరకు సిటు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జగదాంబ జోన్ నాయకుడు ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో రక్త పరీక్షలు, సీటీ స్కానింగ్ వంటివి లేకపోవడం వల్ల పేద రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. డబ్బులు పెట్టి బయట తీయించుకోవడం వారికి కష్టంగా ఉందని, రక్త పరీక్షలు, సీటీ స్కానింగ్ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

కనకమహాలక్ష్మికి నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనక మహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

వ్యర్థాలకు నిప్పు.. కమ్ముకున్న పొగ



సంగం, శరత్ థియేటర్ వెనుక ప్రదేశంలో నిప్పు పెట్టడంతో వ్యాపిస్తున్న పొగ

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు సంగం, శరత్ థియేటర్ వెనుక రోడ్డులో గల ప్రదేశంలో తుప్పలు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో స్థానికులు, దుకాణదారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రెండు వైపులా మంటలు చెలరేగడంతో అక్కడి చెట్లు కాలిపోయాయి. ఈ ఘటనపై పోర్ట్‌టౌన్ పోలీసులకు స్థానికులు ఇచ్చిన సమాచారంతో వారు అక్కడికి వచ్చి పరిశీలించారు. రెండు రోజులుగా చెత్తకు కొందరు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపిస్తున్నాయని తెలియజేశారు. వేడి పొగలు రావడంతో ఇబ్బంది పడుతున్నామని, అధికారులు వెంటనే చర్యలు తగు తీసుకోవాలని స్థానిక వాసులు కోరుతున్నారు.

అశోక్ దృష్టికి ట్రస్ట్‌బోర్డు అజెండా



అజెండాను పరిశీలిస్తున్న అశోక్ గజపతిరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం మార్చి 1న నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు అజెండాలోని అంశాలను తెలియజేస్తూ సోమవారం దేవస్థానం ఈవో త్రినాథరావు, ఈఈ శ్రీనివాసరాజు ట్రస్ట్ బోర్డు చైర్మన్ అశోక్‌గజపతిరాజుని విజయనగరంలోని స్వగృహంలో కలిశారు. మార్చిలో స్వామి వారి వార్షిక కల్యాణోత్సవం, ఏప్రిల్‌లో చందనోత్సవం నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు, అలాగే వివిధ పనులకు సంబంధించి సుమారు 40 అంశాలతో దేవస్థానం అధికారులు అజెండా సిద్ధం చేశారు. ఈ మేరకు వాటిపై ముందస్తుగా చర్చ జరగాలని, ట్రస్ట్‌బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని సభ్యులు దినేష్‌రాజ్, శ్రీదేవి, శ్రీనివాసరావు అధికారులకు సూచించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అధికారులు సంబంధిత అంజెండాతో అశోక్‌గజపతిరాజును కలిశారు. ఈ మేరకు వచ్చే నెల 1న సమావేశం నిర్వహించేందుకు ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది.

వన్‌టౌన్ రోడ్డు విస్తరణ షురూ



వన్ టౌన్‌రోడ్డులో విస్తరణ పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీసీపీ సంజయ్‌రత్నకుమార్

జగదాంబ: వన్‌టౌన్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించినట్టు జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ టౌన్‌ప్లానింగ్ అధికారి సంజయ్‌రత్నకుమార్ తెలిపారు. సోమవారం ఆయన జగదాంబ దరి టర్నర్ చౌల్ట్రీ వద్ద రోడ్డు మ్యాప్ పాయింట్లను ఇన్‌చార్జ్ ఏసీపీ వినయ్‌కుమార్‌తో కలసి మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగదాంబ నుంచి వన్ టౌన్ రాణి విక్టోరియా విగ్రహం వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణకు మార్కింగ్ చేస్తున్నామన్నారు. గతంలో 100 అడుగుల వరకు, తరువాత 80 అడుగులకు ప్రతిపాదనలు తయారు చేశామని, అయితే ప్రజల సౌకర్యార్థం 60 అడుగుల మేర రోడ్డు విస్తరణకు జీవీఎంసీ నిర్ణయించిందన్నారు. ఈ మేరకు గతంలో ఇచ్చిన మార్కింగ్ కాకుండా 60 అడుగులకు మార్కింగ్ వేసి ఇస్తున్నామన్నారు. స్వల్పంగా, పాక్షికంగా దెబ్బతిన్న దుకాణాలు, భవనాల యాజమానులకు టీడీఆర్‌లు ఇచ్చేందుకు జీవీఎంసీ సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే కొందరు టీడీఆర్‌లు పొందారని చెప్పారు. మిగతా వారంతా జీవీఎంసీ జోన్–4లో దరఖాస్తు చేసుకుంటే వెంటనే టీడీఆర్‌లు ఇస్తామని డీసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీవో వరప్రసాద్, చైన్‌మ్యాన్‌లు విశ్వనాథం, పవన్, రమణ, టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు

- ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ స్పెషల్ డ్రైవ్



విశాఖ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ విశాల్ గున్ని ఆదేశాలతో, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.వి.ఎస్.నాగేశ్వరరావు సూచనలతో సోమవారం విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు(జీఆర్పీ) స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో, ప్లాట్‌ఫారాలపై, వివిధ రైళ్లు, వెయిటింగ్ హాల్స్, పార్సిల్ కార్యాలయాల వద్ద గంజాయి, స్మగ్లింగ్, నిషేధిత డ్రగ్స్ కోసం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో జీఆర్పీ సిబ్బందితోపాటు ఆర్పీఎఫ్ ఎస్‌ఐ చంద్రమోహన్, ఏఎస్‌ఐ అనంతరావు, డాగ్ స్క్వాడ్ పాల్గొన్నాయి.

గంజాయి పట్టివేత..: ఈ తనిఖీల్లో భాగంగా విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 3 వద్ద అనుమానిత, వదిలేసిన లగేజీని రైల్వే పోలీసులు తనిఖీ చేయగా.. దీనిలో 10 కేజీల గంజాయి ఉన్నట్లు కనుగొని, సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను కోసం దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ సీఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.

ఏయూ సందర్శన



వాసూరావును సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు సోమవారం సందర్శించారు. వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సాలూరు వాసూరావును వీసీ సత్కరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సంగీత విభాగాన్ని సందర్శించాలని ఆహ్వానించారు. ఏయూలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా సాలూరి వాసూరావు వీసీ ప్రసాదరెడ్డికి ప్రత్యేకంగా భగవద్గీత భావ చిత్ర సుధ పుస్తకాన్ని బహూకరించారు.

విద్యార్థులు మెరైన్ సైంటిస్ట్‌లుగా రాణించాలి



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు అత్యుత్తమ మెరైన్ సైంటిస్ట్‌లుగా రాణించాలని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఏయూ సెంటర్ ఫర్ స్టడీస్ ఆన్ బే ఆఫ్ బెంగాల్, సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఇన్‌కాయిస్) సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సమాచారం ప్రాధాన్యం, ఖచ్చితత్వం, డేటా మోడలింగ్ ఆవశ్యకతలను వివరించారు. ఇన్‌కాయిస్ శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణన్ నాయర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఉన్న ఓషన్ అబ్జర్వేషన్ సిస్టమ్ పనితీరును తెలియజేశారు. సునామీలను ముందస్తుగా గుర్తించడం, అత్యధికంగా మత్స్య సంపద కలిగి ఉండే ప్రాంతాల గుర్తించి మత్స్యకారులకు తెలియజేయడంలో నూతనంగా అభివృద్ధి చేసిన విధానాలు, వ్యవస్థలను వివరించారు. గంగవరం పోర్టు పూర్వ హార్బర్ మాస్టర్ కెప్టెన్ మహంతి మాట్లాడుతూ ముందస్తు అంచనాలు ఇవ్వడంలో ఖచ్చితత్వాన్ని కలిగి ఉండడం ఎంతో ప్రధానమని సూచించారు. సీఎస్‌బీవోబీ డైరెక్టర్ ఆచార్య పి.రామారావు, సీనియర్ ఆచార్యుడు పి.రాజేంద్రప్రసాద్, జియో ఫిజిక్స్ ఆచార్యుడు బి.ఆనందగజపతిరాజు తదితరులు ప్రసంగించారు. 35 మంది యువ శాస్త్రవేత్తలు, వివిధ విద్యా సంస్థలు, పరిశోధన కేంద్రాల ప్రతినిధులు 16 మంది ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌కు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

దాబాగార్డెన్స్: పలు అంశాలపై జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబుకు 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఫిర్యాదు చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. 16వ వార్డు ఇసుకతోటలో జీ+2కు అనుమతులు తీసుకుని, జీ+4 తరహాలో నిర్మాణాలు చేపట్టి అనధికారికంగా కల్యాణ మండపం నడుపుతున్నారని, సీబీసీఎన్‌సీలో చేపడుతున్న నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవని, సాంఘిక సంక్షేమ శాఖ స్థలంతో పాటు జీవీఎంసీ రహదారి విస్తరణకు కేటాయించిన స్థలాన్ని కూడా వినియోగించుకుంటూ జోరుగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. 20వ వార్డులో నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్‌లో నిర్మాణాలు చేపడుతున్నారని, వీటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కోరారు.

ఘనంగా నీలమాంబేశ్వరి తొలేళ్ల ఉత్సవం



తిరువీధి నిర్వహిస్తున్న మహిళలతో కార్పొరేటర్ తోట పద్మావతి, ఆలయ అధ్యక్షుడు చంద్రరావు

అల్లిపురం: అచ్చియ్యమ్మపేట యాతపేట రోడ్డులో కొలువుదీరిన నీలమాంబేశ్వరి అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ అధ్యక్షుడు రీసు చంద్రరావు ఆధ్వర్యంలో అమ్మవారికి తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులు వేపకొమ్మలు, పసుపునీటితో నింపిన 1,116 కలశాలతో తిరువీధి ఉత్సవం చేపట్టారు.

34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతితో పాటు అధిక సంఖ్యలో మహిళలు యాతపేటలోని అమ్మవారి ఆలయం నుంచి కెప్టెన్ రామారావు జంక్షన్, అచ్చియ్యమ్మపేట, జెండా చెట్టు మీదుగా అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి కలశాలతో తెచ్చిన నీటితో అభిషేకించారు. సాయంత్రం భజన కార్యక్రమం అలరించింది.

నేడు ప్రధాన పండగ..

నీలమాంబేశ్వరి అమ్మవారి ప్రధాన పండగ మంగళవారం జరగనుంది. తెల్లవారుజాము నుంచి విశేష పూజలు, అమ్మవారికి అలంకరణ చేయనున్నారు. సాయంత్రం పులివేషాలు, తప్పెటగుల్లు, నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య పరస జరగనుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

20 నుంచి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు



పరీక్షల వివరాలు విడుదల చేస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్‌లో ప్రవేశం పొందిన వారికి మార్చి 20 నుంచి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏయూ టీడీఆర్ హబ్ డీన్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలియజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమ వారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి విడుదల చేశారు. ప్రీ పీహెచ్‌డీ పరీక్షకు ఈ నెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏయూ టీడీఆర్ వెబ్‌సైటులో సంబంధిత వివరాలు నమోదు చేసి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని, సబ్జెక్టుల వారీగా పరీక్ష తేదీలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

నగర పరిశుభ్రతే లక్ష్యం



టౌన్ కొత్త రోడ్డును శుభ్రం చేయిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: స్వచ్ఛ సంకల్పంలో భాగంగా నగర పరిశుభ్రతే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ సూచించారు. సోమవారం ఆయనటౌన్ కొత్తరోడ్డు ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ స్వచ్ఛతా సంకల్పంలో అందర్నీ భాగస్వాములు చేసుకుని పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. ప్రధానంగా రహదారులు శుభ్రంగా ఉండాలన్నారు. పారిశుధ్య కార్మికులు ఉదయాన్నే చెత్త కుప్పలను యార్డులకు తరలించాలని సూచించారు. బ్లాక్ స్పాట్లలో చెత్త లేకుండా చూసుకునే బాధ్యత సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లదేనని చెప్పారు. క్లాప్ వాహనాలు కచ్చితంగా వార్డుల్లోని ప్రతి ఇంటికి వెళ్తే బయట చెత్త కుప్పలుగా పేరుకుపోదన్నారు. సెక్రటరీలు వాహనాల బాధ్యత తీసుకోవాలన్నారు. ఇళ్ల వద్దకు వాహనాలు వెళ్లలేని పరిస్థితిలో పారిశుధ్య కార్మికులతో చెత్తను సేకరించాలన్నారు. అనంతరం వార్డులోని ప్రధాన రహదారులను జెడ్సీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో ఎన్.కిశోర్, వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు 15 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 15 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్ల శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కండి



టెన్త్ విద్యార్థులకు సూచనలిస్తున్న గొండు సీతారామ్

సీతంపేట: స్థానిక మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో సోమవారం 'పరీక్ష పర్వ్' కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టి ఆత్మస్థైర్యం నింపేందుకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్, జిల్లా డైట్ సభ్యులు సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ మాట్లాడుతూ పరీక్షలు జీవితంలో ఒక భాగమని, భయాన్ని వీడి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని పరీక్షలు రాయాలని సూచించారు. మోటివేషనల్ స్పీకర్ జగ్గారావు మాట్లాడుతూ మనల్ని మనం సెన్సిటైజేషన్ చేసుకుని స్థిరమైన మనస్సుతో పరిస్థితులను ఎదుర్కోవాలన్నారు. డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యాల నాయుడు మాట్లాడుతూ జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాని కోసం కష్టపడాలని తెలిపారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు మాధవి, అల్లావుద్దీన్, మోటివేషన్ స్పీకర్ గిరి ప్రసాద్, సీఆర్పీఎఫ్ ప్రతినిధులు బి.శంకుల, కె.లవకుశ, ప్రవీణ, పాఠశాల ప్రధానోపాధ్యాయి శాంతికుమారి, ఎడ్యుకేషన్ సెక్రటరీలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఆటోలో మర్చిపోయిన బ్యాగ్ అప్పగింత

బీచ్ రోడ్డు: ఆటోలో మర్చిపోయిన ట్రాలీ బ్యాగ్‌ను తిరిగి యజమానికి త్రీ టౌన్ క్రైం పోలీసులు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో 112 నంబరుకు రాజేష్‌బాబు అనే వ్యక్తి ఫోన్ చేసి ఆటోలో తన లగేజీ బ్యాగ్ మర్చిపోయినట్టు ఫిర్యాదు చేశారు. పోలీసు బెరాక్స్ నుంచి వుడా పార్క్ వరకు ఆటోలో ప్రయాణించినట్టు తెలిపారు. దీనిపై త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందగా.. క్రైం ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించి ఆటోను గుర్తించారు. అనంతరం బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని సోమవారం యజమానికి అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.

ఆరోగ్యానికి క్రీడలు దోహదం

సింహాచలం: విద్యార్థులు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని రీజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్రస్థాయి అధికారి డాక్టర్ మనోహర్ సూచించారు. పాత పెందుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ప్రతి రోజు గంట సమయం ఆటలకు కేటాయించాలని విద్యార్థులకు సూచించారు.

సీఎం చిత్రపటానికి మత్స్యకార నాయకుల క్షీరాభిషేకం

- ముగ్గురు మత్స్యకారులకు ఎమ్మెల్సీ ప్రకటనపై హర్షం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వాడబలిజ నాయకులు

దాబాగార్డెన్స్: ముగ్గురు మత్స్యకార నాయకులను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించడంపై మత్స్యకార, వాడబలిజ, మత్స్యకార వడ్డీ సామాజిక వర్గానికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పాతనగరం 39వ వార్డు వాడబలిజ సామాజిక భవనం వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మత్స్యకార వాడబలిజ సామాజిక వర్గానికి చెందిన కోలా గురువులు(విశాఖ దక్షిణ), కర్రి పద్మశ్రీ(కాకినాడ సిటీ), మత్స్యకార వడ్డీ సామాజిక వర్గానికి చెందిన జయమంగళ వెంకటరమణ(కైకలూరు)కు ఎమ్మెల్సీలుగా అవకాశం ఇవ్వడం.. తమకు దక్కిన గుర్తింపు అని ఆయా సామాజిక వర్గాల నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూరాడ తాతారావు, బొడ్డు అప్పారావు, అర్జిల్లి మసేన్, వాసుపల్లి రాజు, దూడ తాతారావు, తిక్కాడ అప్పన్న, చేపల మసేను, సూరాడ రాజు, చేపల రాజు, చోడిపల్లి దివ్య, గనగల జయ పాల్గొన్నారు.

ప్రాచీన జ్యోతిష్య గ్రంథాల ఆవిష్కరణ



గ్రంథాలు ఆవిష్కరిస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి

సీతంపేట: కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా అత్యంత ప్రాచీన జ్యోతిష్య గ్రంథాల ఆవిష్కరణ జరిగాయి. పాతగాజువాక జ్యోతిష సరస్వతి పీఠం, ప్రముఖ జ్యోతిష్య పండితుడు నాగులకొండ ఆశ్లేషాచార్య సిద్ధాంతి రచించిన మూడు జ్యోతిష్య గ్రంథాలను సోమవారం శంకరమఠంలో స్వామి ఆవిష్కరించారు. 13వ శతాబ్దానికి చెందిన ప్రముఖ ప్రశ్న గ్రంథం 'భువన దీపిక', 15వ శతాబ్దానికి చెందిన ప్రముఖ ప్రశ్న గ్రంథం 'ప్రశ్న జ్ఞాన ప్రదీప', మహా పండిత డాక్టర్ సుఖదేవ చతుర్వేది ప్రణీత 'మూక ప్రశ్న విచార' గ్రంథాలు ఎంతో వివరణతో అందరికీ సులభంగా అర్థమయ్యేలా ఆశ్లేషాచార్యులు తెలుగులోకి అనువదించారు. ఈ గ్రంథాలు ఎంతో విశిష్టమైనవని శంకర స్వామి ప్రశంసించారు. లోక కల్యాణార్థం రచించిన ఈ గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదివి ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని ప్రజలందరూ సుఖమయ జీవితాన్ని గడపాలని పీఠాధిపతి ఆకాంక్షించారు. కార్యక్రమంలో జ్యోతిష్య పండితులు మధురపాల శంకరశర్మ, పుచ్చా శ్రీనివాసరావు, కొప్పరవు కవుల మనవడు మా శర్మ, మోహన్ పబ్లికేషన్స్ అధినేత రామచంద్రరావు, నాగులకొండ సూర్యాచారి తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం



కంప్యూటర్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

తాటిచెట్లపాలెం: ధరణి సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ రైట్స్ అండ్ యూ(క్రై) సంస్థ సహకారంతో కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్స్‌ను రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ కె.ఎస్.ఎం.జి.హైస్కూల్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ కోర్సులో కంప్యూటర్, ఐటీకి సంబంధించి కనీస పరిజ్ఞానం కల్పిస్తామని నిర్వాహకులు చెప్పారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్(స్టెమ్)పై బాలికలకు ఆసక్తి కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా శిక్షణను ఇస్తున్నట్లు ధరణి సంస్థ కార్యదర్శి బి.హరి తెలిపారు. బాలికలు ఉన్నత విద్యలో రాణించడానికి సాంకేతిక పరిజ్ఞానం, ఇంగ్లిష్, సైన్స్, మ్యాథమెటిక్స్‌ల్లో నైపుణ్యం సంపాదించాలని సూచించారు. నెల రోజుల పాటు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణకు 95 మంది బాలికలను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.రాము, ఉపాధ్యాయిని గ్లోరీ, ధరణి సంస్థ ప్రతినిధులు రమాదేవి, కృష్ణకుమారి, స్టెమ్ ప్రాజెక్టు టీచర్లు ఐశ్వర్య, సాయి లక్ష్మి పాల్గొన్నారు.

దళిత సేన నిరసన



నిరసన తెలుపుతున్న దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు, ప్రతినిధులు

కంచరపాలెం: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్ నుంచి మృత శిశువుతో ద్విచక్ర వాహనంపై గిరిజన కుటుంబీకులు వెళ్లిన అమానుష ఘటనపై దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినప్పటికీ కనీసం అంబులెన్స్ సౌకర్యం కల్పించని దుశ్చర్యను దళిత సేన తీవ్రంగా ఖండిస్తోందన్నారు. సమాచార లోపం కారణంగా గిరిజనులకు అవస్థలు తప్పడం లేదని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఎస్టీ సెల్‌ను పునరుద్ధరించాలని అప్పారావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సేన నగర కన్వీనర్ గొల్లమాల మీనా, పుచ్చా కామేశ్వరరావు, తాటిపూడి సీతారాం, పట్నాల ఝాన్సీ, రాణి, జయకుమార్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు వితరణ



పారిశుధ్య కార్మికులకు పాదరక్షలు, దుప్పట్లు, పండ్లు అందిస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి

దాబాగార్డెన్స్: పాతనగరం స్వామి వివేకానంద సంస్థలో విశాఖ అన్నదాత మట్టపల్లి చలమయ్య 6వ సంస్మరణ సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సీఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత మావూరి వెంకటరమణ, తదితరులు పాల్గొని చలమయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు పాదరక్షలు, దుప్పట్లు, పండ్లు అందజేశారు. మట్టపల్లి హనుమంతురావు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ద్రోణంరాజు శ్రీవత్సవ్, కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, ఎంవీ రాజశేఖర్, వీవీ రమణమూర్తి, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు గజపతి స్వామి, తాతబ్బాయ్, సత్తిబాబు, భాను, నల్లరాజు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

రోడ్డెక్కిన మురుగు నీరు



కోణార్క్ లాడ్జీ వద్ద రోడ్డుపై లీకవుతున్న మ్యాన్‌హోల్

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డులోని పలు ప్రాంతాల్లో యూజీడీ మ్యాన్‌హోళ్లు లీకై మురుగు నీరు రహదారుల పైకి చేరుతోంది. మూడు రోజులుగా డైమండ్‌పార్కు సమీపాన కోణార్క్ లాడ్జీ ఎదురుగా రోడ్డులో మ్యాన్‌హోల్ పొంగుతున్నా.. సంబంధిత సిబ్బంది ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వారు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. శానిటేషన్ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలి.

– కె.రాజా, డైమండ్ పార్క్